క్లుప్తంగా

పైప్‌లైన్‌కు మరమ్మతులు చేయాలి



బురదమయంగా మారిన రహదారిని చూపుతున్న సీపీఎం నాయకులు

కర్నూలు(సెంట్రల్): కర్నూలు నుంచి ఉల్లాలకు వెళ్లే రహదారిలో వీకర్ సెక్షన్ కాలనీలో పైపులైన్ పగిలిపోవడంతో రోడ్డంతా బురదమయంగా మారుతోందని సీపీఎం నగర కార్యదర్శి టి.రాముడు వాపోయారు. బుధవారం సీపీఎం నాయకులు రోడ్డు దెబ్బతిన్న ప్రాంతాన్ని పరిశీలించారు. పైపులైన్ పగిలిపోవడంతో గుంతలు పడి నీరు రోడ్డుపైనే నిలుస్తోందన్నారు. వాటిని తొలగించేందుకు ఆర్ అండ్‌బీ, మునిసిపల్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదన్నారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని కోరారు. నాయకులు జమ్మన్న, అబ్దుల్, రహిమాన్ పాల్గొన్నారు.

అమరవీరుల ఆశయాలు సాధిద్దాం



అమరవీరులకు నివాళులర్పిస్తున్న సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు

కర్నూలు(సెంట్రల్): అమరవీరుల ఆశయాల సాధన కోసం ఉద్యమిద్దామని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నగర కార్యదర్శి, పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.భాస్కర్ పిలుపునిచ్చారు. బుధవారం నగరంలోని గోకారి భవన్‌లో అమరవీరుల సంస్మరణ సభ జరిగింది. ముందుగా అమరవీరుల చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సుత్తి, కొడవలి జెండాను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఏటా విప్లవకారులను మననం చేసుకోవడం కోసం అమరవీరుల స్మారక సభలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నాయకులు దామోదర్, రాజు, మౌలా బీ,రేణుకవ ఫాతిమా, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి స్పందన



రక్తదానం చేస్తున్న ఏజీఎం సురేష్‌కుమార్

కర్నూలు సిటీ: స్థానిక భాగ్యనగర్‌లోని శ్రీచైతన్య జూనియర్ కాలేజీలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఆ కాలేజీల ఏజీఎం మురళీకృష్ణ, స్కూళ్ల విభాగం ఏజీఎం సురేష్‌కుమార్ ప్రారంభించారు. ప్రతి ఒక్కరు రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని, ప్రమాదంలో గాయపడిన వారికి, అనారోగ్యంతో చికిత్స, శస్త్ర చికిత్సలు చేయించుకునే వారి ప్రాణాలను కాపాడిన వారుగా నిలుస్తారని అన్నారు. రక్తదానం వల్ల ఆరోగ్యం మరింత మెరుగవుతుందన్నారు. శిబిరంలో 92 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. విద్యాసంస్థల డీన్‌లు, ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

కార్తీక దీపోత్సవానికి ఏర్పాట్లు చేయండి



మాట్లాడుతున్న నగరపాలక కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు (టౌన్): స్థానిక వినాయక్‌ఘాట్‌లో ఈనెల 15వ తేదీన నిర్వహించనున్న కార్తీక దీపోత్సవ కార్యక్రమానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు ఆదేశించారు. బుధవారం స్థానిక నగరపాలక కార్యాలయంలోని తన చాంబర్‌లో నగరపాలక, అగ్నిమాపక, విద్యుత్, జలవనరులు, మత్స్యశాఖ, పోలీసు శాఖ, కార్తీక దీపోత్సవ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. కార్తీక దీపోత్సవం సందర్భంగా భక్తులకు ఇబ్బంది కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. లైటింగ్, మహిళా పోలీసు, గజ ఈతగాళ్లు, ఫైరింజన్ వంటివి అందుబాటులో ఉంచాలని సూచించారు. సమావేశంలో అదనపు కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, ఎంహెచ్‌ఓ డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, ఎస్‌ఈ రాజశేఖర్, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

కర్నూలు(సెంట్రల్): నవంబర్ 10వ తేదీన విజయవాడలో జరిగే మునిసిపల్ ఇంజినీరింగ్ కార్మికుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ అంజిబాబు బుధవారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ సదస్సుకు రాష్ట్ర మునిసిపల్ పరిపాలన శాఖ మంత్రి పి.నారాయణ హాజరుకానున్న నేపథ్యంలో సమస్యలు చెప్పుకోవడానికి అవకాశం ఉంటుందని, ఈ కార్యక్రమానికి జిల్లా నుంచి పెద్దఎత్తున తరలిరావాలని కోరారు.

- పెరుగుతున్న క్యాన్సర్ రోగులు
- మహిళల్లో రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్లు
- పురుషుల్లో జీర్ణకోశ, నోటి క్యాన్సర్లు అధికం
- అందుబాటులో ఆధునిక వైద్యం
- స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌కు గ్రహణం
- నేడు జాతీయ క్యాన్సర్ అవగాహన దినం



క్యాన్సర్ కణజాలం



మాయదారి మహమ్మారి

కర్నూలు(హాస్పిటల్): మాయదారి క్యాన్సర్ మనుషుల ప్రాణాలను హరించివేస్తోంది. చాలా మందికి ఆ వ్యాధి వచ్చిందని తెలిసేలోగా చివరి రోజులు లెక్కించాల్సిన పరిస్థితి. ముందస్తుగా ఎలాంటి లక్షణాలు లేకుండా లోలోపల శరీరాన్ని నాశనం చేసే ఈ మహమ్మారి ఉన్నట్లుండి మనిషిని తీసుకెళ్లిపోతోంది. రోజురోజుకూ ఈ వ్యాధి బారిన పడి అశువులు బాస్తున్న వారు అధికం అవుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ వ్యాధిని ముందుగా గుర్తించేందుకు ఎన్‌సీడీ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నాయి. ఈ నెల 7వ తేదీన జాతీయ క్యాన్సర్ అవగాహన దినం సందర్భంగా ప్రత్యేక కథనం.

జిల్లాలో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలతో పాటు ప్రైవేటుగా విశ్వభారతి క్యాన్సర్ హాస్పిటల్, ఒమెగా క్యాన్సర్ హాస్పిటల్స్ ఉన్నాయి. ఈ మూడింటిలో దాదాపుగా అన్ని రకాల క్యాన్సర్‌లకు ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా వైద్యం అందుతోంది. కరోనాకు ముందు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని క్యాన్సర్ విభాగంలో రోజూ ఓపీకి 25 నుంచి 30 మంది చికిత్స కోసం వచ్చేవారు. రోజూ 25 మంది వరకు ఆసుపత్రిలోనే రేడియేషన్ థెరపీ, 10 మందికి కీమోథెరపీ అందించేవారు. ప్రైవేటు ఆసుపత్రులు లేని సమయంలో ఈ ఆసుపత్రికి కర్నూలు జిల్లాతో పాటు వైఎస్సార్ జిల్లా, అనంతపురం, మహబూబ్‌నగర్, బళ్లారి, రాయచూరు జిల్లాల నుంచి వచ్చేవారు. 17 ఏళ్ల క్రితం రాయలసీమకంతటికీ కర్నూలులో ఒక్కరే క్యాన్సర్ డాక్టర్ ఉండేవారు. ఇప్పుడు ప్రైవేటులోనూ వైద్యం అందిస్తుండటంతో రోగులకు ఉపశమనం లభిస్తోంది. ప్రస్తుతం ప్రైవేటు ఆసుపత్రులు, క్లినిక్‌లలోనూ రోజూ 80 నుంచి 90 మంది వరకు కొత్తగా క్యాన్సర్ రోగులు చికిత్స కోసం వస్తున్నారు. 2019 నుంచి ఇప్పటివరకు జిల్లాలో దాదాపు 2 లక్షల మంది క్యాన్సర్ వ్యాధికి చికిత్స పొందారు.

అందుబాటులోకి రాని స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్

కర్నూలులోని ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఆవరణలో రూ.120 కోట్లతో స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ నిర్మాణం పూర్తి చేసుకుని గత మార్చిలో ప్రారంభమైంది. అయితే పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందించడం లేదు. అవసరమైన పడకలు, వైద్య పరికరాలు, వైద్యులు, సిబ్బందిని ఏర్పాటు చేయలేదు. ఈ ఇన్‌స్టిట్యూట్ పూర్తిస్థాయిలో ప్రారంభమైతే అత్యాధునిక లీనియర్ ఆక్సిలరేటర్ (రేడియేషన్ మిషన్), ఎక్స్‌టర్నల్ ఆర్‌టీ మిషన్, బ్రాచి థెరపి హెచ్‌డీఆర్ (నేరుగా క్యాన్సర్ కణితిపై రేడియేషన్ ఇస్తారు), సీటీ సిమిలేటర్ పరికరాలు, ప్రత్యేకంగా రేడియాలజీ విభాగం, పెథాలజీ, మైక్రోబయాలజీ విభాగాల సేవలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే మెడికల్, సర్జికల్, రేడియేషన్ ఆంకాలజీ వైద్యులు, సైకియాట్రిస్టులు ఇక్కడ వైద్యసేవలు అందిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం దీనిపై దృష్టి సారించి పూర్తిస్థాయి ఏర్పాట్లు చేస్తే ప్రజలకు మెరుగైన క్యాన్సర్ వైద్యం అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.



కర్నూలు స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ భవనం

క్యాన్సర్‌ను ఇలా అనుమానించాలి

మానకుండా ఉండే పుండు, శరీరంలో ఏ భాగంలోనైనా ఎదుగుతున్న కణితులు, అసహజమైన రక్తస్రావం, పెరుగుతున్న పుట్టుమచ్చలు, పులిపిరి కాయలు, మింగడం కష్టంగా ఉండటం, గొంతు బొంగురుపోయి తగ్గకుండా ఉండటం, చాలా రోజులుగా అజీర్ణ వ్యాధి తదితర లక్షణాలు ఉంటే తక్షణమే క్యాన్సర్ వైద్యులను కలిసి పరీక్షలు చేయించుకోవాలి.

క్యాన్సర్ నివారణ మార్గాలు

- ధూమ, మద్యపానం, పొగాకు సేవనం మానేయాలి
- పరిశుభ్రమైన నీరు, ఆహారం తీసుకోవాలి
- రోజూ 4 నుంచి 5 లీటర్ల నీటిని తాగాలి
- హెచ్‌పీవీ, హెపటైటిస్ బీ టీకాలు వేయించుకోవాలి
- తాజా పండ్లు, ఆకుకూరలు తినాలి
- రిఫైన్డ్ కార్బోహైడ్రేట్స్, కేక్స్, చిప్స్, కార్బొనేటెడ్ డ్రింక్స్‌కు దూరంగా ఉండాలి
- పొట్టేలు మాంసం తగ్గించాలి. చేపలు, కోడి మాంసం తినాలి
- అధిక బరువు తగ్గించుకోవాలి. రోజూ వ్యాయామం చేయాలి.

క్యాన్సర్‌కు కారణాలు: క్యాన్సర్ వ్యాధి రావడానికి పలు అంశాలు దోహదం చేస్తున్నాయి. ఇందులో 4 శాతం జన్యుపరంగా, 6 శాతం తీసుకునే నీరు, ఆహారం, 15 శాతం స్థూలకాయం (రొమ్ము, గర్భాశయం, పేగు, మూత్రపిండాల క్యాన్సర్లు), 40 శాతం పొగాకు (నోరు, ఊపిరితిత్తుల క్యాన్సర్‌లు), 10 శాతం ఇన్‌ఫెక్షన్లు (హెచ్‌పీవీ, హెపటైటిస్ బి వల్ల వచ్చే కాలేయ క్యాన్సర్), 25 శాతం క్యాన్సర్లు (రక్తం, ఎముక, పాంక్రియాస్ క్యాన్సర్)కు సరైన కారణాలు లేవని వైద్యు లు చెబుతున్నారు.మగవారిలో ఎక్కువగా నోటి, జీర్ణాశయ,కాలేయ, ఊపిరితిత్తుల క్యాన్సర్లు, స్త్రీలలో రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్లు వస్తున్నాయి.

క్యాన్సర్ రోగుల సంఖ్య పెరుగుతోంది



జిల్లాలో క్యాన్సర్ రోగుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. మారిన జీవనశైలి, ధూమ, మద్యపానాలు, పొగాకు సేవనం, వంశపారంపర్యం వంటి కారణాల వల్ల కేసుల సంఖ్య ఎక్కువవుతోంది. దేశంలో ఏటా 14 లక్షల క్యాన్సర్ కేసులు నమోదవుతున్నాయి. నాలుగు నిమిషాలకు ఒకరికి రొమ్ము క్యాన్సర్‌ను గుర్తిస్తున్నారు. ప్రతి 13 నిమిషాలకు రొమ్ము క్యాన్సర్‌తో ఒక మహిళ మరణిస్తోంది. 50 శాతం కన్నా ఎక్కువ క్యాన్సర్లు దేశంలో అడ్వాన్స్ స్టేజిలో జబ్బు ముదిరిన తర్వాత గుర్తించాల్సి వస్తోంది. ఈ వ్యాధిని ముందే గుర్తిస్తే మెరుగైన వైద్యం అందించి నయం చేసే అవకాశం ఉంది.

–డాక్టర్ సి.వాసురెడ్డి, సర్జికల్ ఆంకాలజిస్టు, కర్నూలు

మహిళలు రొమ్ము పరీక్ష చేయించుకోవాలి



40 ఏళ్లు దాటిన మహిళలు ఛాతిలో చిన్న గడ్డ కనిపించినా వెంటనే రొమ్ము పరీక్ష (మామోగ్రామ్) చేయించుకోవాలి. బాలింతలు తప్పనిసరిగా ఏడాదిన్నర వరకు బిడ్డకు చనుబాలు ఇవ్వాలి. లేకపోతే రొమ్ము క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంది. 9 నెలలు నిండాక బిడ్డను జన్మనివ్వకపోయినా, 25 ఏళ్లలోపు ఒక్కసారైనా గర్భం దాల్చకపోయినా, త్వరగా రజస్వల అయ్యేవారిలో, మెనోపాజ్ 55 ఏళ్లు దాటినా కాకపోతే, మెనోపాజ్ తర్వాత హార్మోన్ మందులు వాడేవారిలో, అధిక బరువు ఉండేవారిలో క్యాన్సర్ వచ్చే అవకాశం ఎక్కువ.

–డాక్టర్ ఏఎస్.భార్గవ వ్యాస్, జనరల్ సర్జన్, కర్నూలు

మౌలిక వసతులు కల్పించండి



కలెక్టర్ పి.రంజిత్‌బాషాకు వినతిపత్రం ఇస్తున్న ఎన్‌టీఎఫ్ నాయకులు

కర్నూలు(సెంట్రల్): ఎస్టీ కాలనీల్లో కనీస మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ రాయలసీమ రీజనల్ ఇన్‌చార్జ్ మోపిరిసూర్య డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఎన్‌టీఎఫ్ నాయకులు ఎస్టీ కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ కలెక్టర్ పి.రంజిత్‌బాషాకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్టీ కాలనీల్లో రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించాలని కోరారు. తాగునీటి వసతి కల్పించాలని, మినీ ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హాళ్లను నిర్మించాలని డిమాండ్ చేశారు. ఎన్‌టీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కుశలన్న, మోటా సురేష్ పాల్గొన్నారు.

రైల్వే నోటిఫికేషన్ విడుదల చేయాలి

కర్నూలు(సెంట్రల్): రైల్వేలో ఖాళీగా ఉన్న పోస్టులను రిటైర్డ్ అయిన ఉద్యోగులతో కాంట్రాక్ట్ పద్ధతిలో భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవడం అన్యాయమని, వెంటనే ఆ ప్రక్రియను ఉపసంహరించుకోవాలని డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి వై.నగేష్ డిమాండ్ చేశారు. బుధవారం డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో రైల్వేస్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యేటేటా దేశంలో నిరుద్యోగుల సంఖ్య పెరిగిపోతుంటే..వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించకుండా కేంద్ర ప్రభుత్వం ఆటలు ఆడుతోందన్నారు. అడపాదడపా నోటిఫికేషన్‌లు వచ్చే రైల్వే రంగంలోనూ రిటైర్డ్ ఉద్యోగులను తీసుకోవాలని నిర్ణయించడం దారుణమన్నారు. ఖాళీగా ఉన్న 2.98 లక్షల ఉద్యోగాల భర్తీకి వెంటనే నోటిఫికేషన్లను ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రంగప్ప, సురేష్, విజయ్ పాల్గొన్నారు.



రైల్వే స్టేషన్ ఎదుట నిరసన తెలుపుతున్న డీవైఎఫ్‌ఐ నాయకులు

ఆర్‌టీఓ సేవల ప్రైవేటీకరణ తగదు



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న ఆటో యూనియన్ నాయకులు

కర్నూలు(సెంట్రల్): ఆర్‌టీఓ కార్యాలయ సేవలను ప్రైవేటీకరిస్తే ఆటోల బంద్‌కు పిలుపునిస్తామని ఏపీ ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ హెచ్చరించారు. బుధవారం సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మోటార్ వెహికల్ యాక్ట్ సవరణతో వాహనాల రిజిస్ట్రేషన్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు, డ్రైవింగ్ లైసెన్సుల జారీ ప్రక్రియను ప్రైవేట్‌కు అప్పగించేందుకు కేంద్రం కుట్రలు చేస్తుందన్నారు. మోటార్ వాహనాలకు సంబంధించి విడుదల చేసిన జీఓ నంబర్ 21ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు కుమార్, నాగరాజు, వెంకటస్వామి, బడేబాషా పాల్గొన్నారు.

పైప్‌లైన్ పనులను వేగవంతం చేయండి

కర్నూలు (టౌన్): నగర ప్రజల దాహార్తిని తీర్చేందుకు సుంకేసుల జలాశయం నుంచి మునగాలపాడు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు వరకు రూ.82 కోట్లతో చేపడుతున్న పైప్‌లైన్ పనులను వేగవంతం చేయాలని నగరపాలక కమిషనర్ రవీంద్రబాబు ఆదేశించారు. బుధవారం సుంకేసుల జలాశయం వద్ద ఇంటెక్ వెల్, పైప్‌లైన్ పనులను కమిషనర్ పరిశీలించారు. పనుల ప్రగతి గురించి పబ్లిక్ హెల్త్ ఇంజినీరింగ్ అధికారులతో చర్చించారు. పనుల పురోగతి, జలాశయం నీటి సామర్థ్యం, ఎస్‌ఎస్ ట్యాంకుకు సరఫరా వంటి వివరాలను కమిషనర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. రాజ్‌విహార్ సమీపంలో హంద్రీ నదిని పరిశీలించారు. నదిని శుభ్రంగా ఉంచాలని, అనవసరమైన చెత్తాచెదారం, పిచ్చిమొక్కలను వెంటనే తొలగించాలని ఆదేశించారు. ప్రజారోగ్య సాంకేతిక శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ చంద్రమోహన్, డీఈఈ వెంకటేశ్వర్లు, ఏఈ నాగశేఖర్, ఏజెన్సీ ఇంజినీర్ సుబ్బయ్య, నగరపాలక ట్రైనీ ఏఈ మహేష్ పాల్గొన్నారు.



పబ్లిక్ హెల్త్ ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ రవీంద్రబాబు

విజయవంతం చేయండి



బ్రోచర్‌ను విడుదల చేస్తున్న డీఈఓ శామ్యూల్‌పాల్

కర్నూలు సిటీ: భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ (యూఎస్‌ఎఫ్‌ఐ) జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని ఆ ఫెడరేషన్ రాష్ట్ర కన్వీనర్ ఉదయ్‌కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం డీఈఓ శామ్యూల్ పాల్ చేతుల మీదుగా యూఎస్‌ఎఫ్‌ఐ జాతీయ మహాసభల బ్రోచర్‌ను విడుదల చేశారు. అనంతరం ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ.. విజయవాడలోని మాకినేని బసవ పున్నయ్య షాహిద్ భగత్ సింగ్ ఆడిటోరియంలో డిసెంబర్ 14, 15 తేదీల్లో మహాసభలు జరుగుతాయని, పెద్ద ఎత్తున విద్యార్థులు హాజరుకావాలని పిలుపునిచ్చారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలు చొరవ చూపాలని డిమాండ్ చేశారు.

దమ్ముంటే.. ఆరోపణలు నిరూపించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్లు

- టీడీపీ నేతలకు 23వ వార్డు కార్పొరేటర్ సవాల్
- వృద్ధురాలిపై దాడిని మంత్రి సమర్థిస్తున్నారా? అని నిలదీత

కర్నూలు (టౌన్): ఆధారాలు లేని ఆరోపణలు చేస్తున్న టీడీపీ నాయకులకు దమ్ముంటే వాటిని నిరూపించాలని వైఎస్సార్‌సీపీ 23వ వార్డు కార్పొరేటర్ కటారి పల్లవి, పార్టీ వార్డు ఇన్‌చార్జ్ కటారి సురేష్ కుమార్ సవాల్ విసిరారు. ఇంట్లో ఉన్న 75 ఏళ్ల వృద్ధురాలిపై దాడి చేసిన టీడీపీ మాజీ కార్పొరేటర్ గున్నా మార్కు తమ్ముడిని మంత్రి టీజీ భరత్ సమర్థిస్తున్నారా? అని ప్రశ్నించారు. బుధవారం సాయంత్రం స్థానిక ఎస్వీ కాంప్లెక్స్ సమావేశ హాలులో వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు, పార్టీ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. సమస్యను పక్కదారి పట్టించేందుకే టీడీపీ నాయకులు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. తాము అక్రమాలు చేసిఉంటే అధికారంలో ఉన్న టీడీపీ విచారణ చేయించవచ్చు కదా? అని నిలదీశారు. సి.క్యాంపు మున్సిపల్ పాఠశాల వద్ద అక్రమంగా ఏర్పాటు చేసిన బంకుల వల్ల విద్యార్థినులకు ఇబ్బంది కలుగుతోందని, దీనిపై మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడంతోనే కౌన్సిల్ సమావేశంలో మంత్రి టీజీ భరత్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. మంత్రికి చెప్పినందుకే తమ ఇంటిపైకి వచ్చి దాడి చేశారని వాపోయారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు కేసు నమోదు చేయలేదని, దీనిపై జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేస్తామన్నారు. స్టాండింగ్ కమిటీ సభ్యులు విక్రమసింహారెడ్డి, వైఎస్సార్‌సీపీ సేవాదళ్ నాయకులు మల్లికార్జున మాట్లాడుతూ.. సమస్యపై ప్రశ్నిస్తే దాడులు చేస్తారా అని ప్రశ్నించారు. బంకులను తొలగించాలని, వృద్ధురాలిపై దాడికి పాల్పడిన టీడీపీ కార్యకర్తను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా స్పందించకుంటే భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తామని స్పష్టం చేశారు. నగరపాలక స్టాండింగ్ కమిటీ సభ్యులు యూనూసు బాషా, జుబేర్ అహమ్మద్, కార్పొరేటర్లు షాషావలీ, క్రిష్ణాకాంత్, రాజేశ్వర రెడ్డి పాల్గొన్నారు.



కర్నూలు మార్కెట్ ధరలు (క్వింటా రూ..ల్లో)

వేరుశనగ	2110	6500
పొద్దుతిరుగుడు	1509	5369
ఆముదం	3609	5849
వాము	12269	20960
ఉల్లి	622	4849
ఎండుమిర్చి	1039	12345
శనగలు	6009	6009
కందులు	3841	7100
మొక్కజొన్న	1869	2271
మినుములు	1300	7739
కొర్రలు	2479	3491
సోయాచిక్కుడు	4079	4191
సజ్జలు	1969	2159

విద్యుత్ చార్జీలపై నిరసనకు పిలుపు

కర్నూలు(సెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ సర్దుబాటు చార్జీలను రద్దు చేయాలని కోరుతూ ఈనెల 8వ తేదీన సాయంత్రం 6 గంటలకు విద్యుత్ భవన్ ఎదుట కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టనున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచబోమని చెప్పి ఇప్పుడు ప్రజలను మోసం చేస్తోందని పేర్కొన్నారు. దీనిపై కాంగ్రెస్ పార్టీ నిరసనలకు పిలుపునిచ్చినట్లు వెల్లడించారు.

విద్యార్థులకు క్రీడాపోటీలు

కర్నూలు (టౌన్): స్థానిక పాతబస్తీలోని సీరాక్ పాఠశాలలో బుధవారం అంతర్గత క్రీడాపోటీలు ప్రారంభమయ్యాయి. పోటీలను కరెస్పాండెంట్ ఇబ్రహీం, ప్రధానోపాధ్యాయులు వజీర్ ఖాతూన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థినీ, విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు కొంత సమయాన్ని కేటాయించినప్పుడే ఒత్తిడికి దూరంగా ఉంటారని చెప్పారు. కబడ్డీ, ఖోఖో, రన్నింగ్ రేస్, మ్యూజికల్ చైర్స్, బాల్ గేమ్స్ పోటీలను నిర్వహించారు. వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యాసరచన విజేతలకు బహుమతుల ప్రదానం



విజేతలకు బహుమతులు అందిస్తున్న వీసీ ఆచార్య పీఎస్ షావలిఖాన్, తదితరులు

కర్నూలు సిటీ: ఎకనామిక్స్ డే సందర్భంగా డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ విశ్వవిద్యాలయంలో ×భారతదేశ ఆర్థిక వ్యవస్థపై అమర్త్యసేన్ ప్రభావం€ అనే అంశంపై విద్యార్థులకు బుధవారం వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉర్దూ యూనివర్సిటీ వీసీ ఆచార్య పీఎస్ షావలిఖాన్, మానవ వనరుల పరిశోధన కేంద్ర వ్యవస్థాపకులు ఆచార్య మన్సూర్ రహమాన్‌లు పాల్గొని విజేతలకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆచార్య అమర్త్యసేన్ అర్థశాస్త్ర స్థాయిని విస్తృత పరిచి, నైతిక విలువలతో అనుసంధానం చేశారని కొనియాడారు. కేవలం భౌతిక అభివృద్ధి, సంపద సృష్టి మాత్రమే అర్థశాస్త్ర పరిధి కాదని అసమానతలు, పేదరిక నిర్మూలన, మానవ సంక్షేమం సాధించడమే పరమావధిగా ప్రపంచానికి తెలియజేశారన్నారు. వ్యాస రచన పోటీల్లో బి.గంగావతి, షేక్ యాసిన్ బాను, ఎం.శిరీష బహుమతులను అందుకున్నారు. వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య లోక్‌నాథ్, సమన్వయకర్త డాక్టర్ అక్బర్‌బాను, ప్రిన్సిపాల్ డాక్టర్ మహబూబ్ బాష, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎల్.భాస్కర్‌కు వినతి పత్రం ఇస్తున్న 104 ఉద్యోగులు

కర్నూలు(హాస్పిటల్): జిల్లాలో పనిచేస్తున్న 104 వాహన సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని ఉద్యోగులు డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎల్.భాస్కర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమకు 3 నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదని, కుటుంబాలను పోషించుకోవడం కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. 104 ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు వై.వెంకటేశ్వర్లు, ట్రెజరర్ చంద్రహాస్, ఇలియాస్, తదితరులు ఉన్నారు.